రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు తరలిన నేతలు


నాచారం నుంచి..


గౌతంనగర్ నుంచి..


హెచ్‌బీకాలనీ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు

మల్లాపూర్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు బుధవారం నాచారం నుంచి భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల ముత్యంరెడ్డి, మేడల మల్లికార్జున్‌గౌడ్, స్థానిక నాయకులు, ఉద్యమకారులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయం..

గౌతంనగర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతారాముయాదవ్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్‌కు గౌతంనగర్ నుంచి బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. స్థానిక బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

కుషాయిగూడ: బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమానికి మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు కార్పొరేటర్ ప్రభుదాస్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు గుండారపు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ.. కొద్ది నెలల్లోనే కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, వారిపై వచ్చిన వ్యతిరేకతే బీఆర్ఎస్‌ను గెలిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం


పీర్జాదిగూడలో ప్రచారంలో సునీతామహేందర్‌రెడ్డి


మచ్చబొల్లారంలో కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్


ఇంటింటి ప్రచారంలో బొంతు శ్రీదేవి, పట్నం మనీషారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో గడపగడపకు కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ 1వ డివిజన్ ఏవీ ఇన్ఫోప్రైడ్‌లోని శివాలయంలో మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, పీర్జాదిగూడ కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు.

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ.. బుధవారం మచ్చబొల్లారం డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి ..

కుషాయిగూడ: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. బుధవారం అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా ఆమె కూమార్తె మనీషారెడ్డితో కలిసి చర్లపల్లి డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. నెహ్రూనగర్, భరత్‌నగర్, న్యూ విరాట్‌నగర్, జమ్మిగడ్డ, కుషాయిగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోచయ్యగౌడ్, నాగిళ్ల బాల్‌రెడ్డి, అంజిరెడ్డి, అల్లూరయ్య, శ్రీకాంత్‌యాదవ్, నవనీత, సంధ్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ దాఖలు..


నామినేషన్ దాఖలు చేస్తున్న నర్రా సుఖేందర్‌రెడ్డి

కుషాయిగూడ: విద్యార్థుల రాజకీయ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా నర్రా సుఖేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ పార్టీలు ప్రజలను ఉచితాలకు అలవాటు చేసి సోమరులుగా మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల రాజకీయ పార్టీ అనవసర ఉచితాలకు పూర్తి వ్యతిరేకమన్నారు. ఉచిత విద్య, వైద్యం అందించడమే తమ పార్టీ ముఖ్య ఉద్దేశంతోనే పోటీలో నిలుస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యావంతులు, మేధావులు, యువకులు తమ పార్టీని స్వాగతిస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఉచిత విద్య, వైద్యం నినాదంతో ప్రజల్లోకి వెళ్లనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



మల్కాజిగిరి: కుర్తాళం సిద్దేశ్వరీ పీఠపాలిత శిరిడి సాయిబాబా మందిరం ఆవరణలో వారాహీ, ప్రత్యంగిరా, నవగ్రహ, నాగదేవతా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడ్రోజుల పాటు జరిగే ప్రతిష్ఠాపనలో మొదటి రోజు గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజ, అఖండ దీపస్థాపన, అంకురారోపణ, రక్షాబంధనం, కలశ స్థాపన, జలాధివాసం పూజా కార్యక్రమాలు జరిగాయి. కుర్తాళం సిద్దేశ్వర పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ పర్యవేక్షించారు. రామక్రిష్ణ, లక్ష్మణ్‌రావు, రాములు, శ్రీకాంత్, శివకోటేశ్వర రాజు, మునిపల్లె శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రామంతపూర్: గోఖలేనగర్‌లోని షిప్స్ జూనియర్ కళాశాల విద్యార్థులు బుధవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించారు. వైష్ణవి (ఎంపీసీ) 464/470, సమీరా 463/470, కావ్య 463/470, ఎస్కేజో హ్రనాజ్ 462/470, దీపిక 462/470 అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజరెడ్డి అభినందించారు.

బోడుప్పల్: బోడుప్పల్ లక్ష్మీనగర్ (హుడా) కాలనీలో నివాసం ఉండే ఆరికట్ల హాసిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చాటింది. హబ్సిగూడ నారాయణ కాలేజీలో చదివే హాసిని 470/458 మార్కులు సాధించింది. ఫిజిక్స్‌లో 60/60, మ్యాథ్స్–బి లో 75/75, మ్యాథ్స్–ఎలో 75/72 మార్కులు సాధించారు. కెమిస్ట్రీలో 60/58 మార్కులు, సంస్కృతంలో 100/96, థియరీలో 80/78 మార్కులు, ప్రాక్టికల్స్‌లో 20/19 మార్కులు సాధించారు.


వైష్ణవి 464/470


హాసిని 470/458

మేడిపల్లి: ఇంద్రాణి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని చైర్మన్ సుదర్శన్, వనజ పేర్కొన్నారు. తెలంగాణ ఇంటర్ బోర్డు బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ఫిర్జాదిగూడలోని ఇంద్రాణి జూనియర్ కళాశాల విజయదుందుభి మోగించింది. సీనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీలో వర్షిత (986), సాయికీర్తి, భానుచందర్‌లు (982), బైపీసీలో రుత్ ఏంజెలిన్(954), సిరిచందన (944) సాధించగా.. జూనియర్ ఇంటర్మీడియట్ ఎంపీసీలో శివాని (467), ఐశ్వర్యగౌడ్ (466), హుస్సేన్, తేజిత భరద్వాజ్, రజనీకాంత్‌లు (465) సాధించారు.

ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు !

ఉప్పల్: ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో నేడు సాయంత్రం నిర్వహించే ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా ఉప్పల్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు రాచకొండ కమిషనర్ కార్యాలయం పోలీసులు ఓ ప్రకటనలో తెలిపారు. వరంగల్, ఉప్పల్, ఎల్‌బీనగర్, సికింద్రాబాద్ వైపు నుంచి ఉప్పల్ వైపు వచ్చే అన్ని భారీ వాహనాలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి11.30 వరకు దారి మళ్లించినట్లు తెలిపారు. వరంగల్ నుంచి వాహనాలు చెంగిచర్ల మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వరంగల్ నుంచి ఎల్‌బీనగర్ వెళ్లే వాహనాలు ఉప్పల్ బగాయత్ నుంచి దారి మళ్లిస్తున్నట్లు వివరించారు. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలు హబ్సిగూడ మీదుగా మల్లాపూర్, చర్లపల్లి చెంగిచర్ల మీదుగా వరంగల్ వైపు వెళ్లాల్సి ఉంటుందన్నారు.

అనుమానాస్పద స్థితిలో జీహెచ్ఎంసీ కార్మికుడి మృతి


కృష్ణ (ఫైల్)

ఉప్పల్: అనుమానాస్పద స్థితిలో జీహెచ్ఎంసీ కార్మికుడు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ సాయికృష్ణకాలనీలో నివసించే కృష్ణ(47) జీహెచ్ఎంసీలో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గతేడాది క్రితం భార్య రాధ మృతి చెందడంతో అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. రెండ్రోజుల క్రితం తాను ఉంటున్న గదిలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రమైన దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

కండక్టర్ బ్యాగ్ నుంచి నగదు చోరీ

మేడ్చల్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తులు ఆర్టీసీ బస్ కండక్టర్ సాయికుమార్ బ్యాగ్ నుంచి నగదు చోరీ చేసిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం రాత్రి రామాయంపేట నుంచి సికింద్రాబాద్ బయలుదేరింది. మార్గమధ్యలో బ్యాగును కండక్టర్ చూసుకోగా తన బ్యాగులో ఉండాల్సిన రూ.10 వేల నగదు కనిపించలేదు. దీంతో మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

బస్తీ యాక్షన్ ప్లాన్‌పై దృష్టి సారించండి : డీసీ


మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్

చాదర్‌ఘాట్: తరచూ చెత్తా చెదారం పేరుకుపోతున్న ప్రాంతాలపై దృష్టి పెట్టి, వాటిని పూర్తిగా తొలగించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ అధికారులకు సూచించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో ఆయన ఏఎంహెచ్‌ఓలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్‌లకు ఎర్లీబర్డ్ పథకంతో పాటు బస్తీ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. బస్తీ యాక్షన్ ప్లాన్‌పై పూర్తి అవగాహన పెంచుకోవాలని, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో ఏఎంహెచ్‌ఓలు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే బాగుండదని ఆయన హెచ్చరించారు. చెత్త నిల్వలు ఉంటున్న ప్రాంతాలను పూర్తిగా నిర్మూలించే దిశలో ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఎర్లీబర్డ్ పథకానికి ఇంకో వారం రోజులు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. ఈ నెలాఖరుకు లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

ఈటలను బలపరచండి..


బీజేపీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్

మల్కాజిగిరి: కేంద్రంలో మోదీ సర్కార్ మరోసారి రావాలంటే ఈటల రాజేందర్‌ను బలపరచాలని మల్కాజ్‌గిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని గీతానగర్, మారుతీనగర్ ప్రాంతాల్లో పార్టీ సీనియర్ నాయకుడు రాంబాబుతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలవాలన్నా.. సురక్షిత దేశంగా ఉండాలన్నా.. మరోసారి బీజేపీ ప్రభుత్వం వస్తేనే సాధ్యమవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సుబ్రహ్మణ్యం, వెంకటేష్‌గౌడ్, జస్వంత్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లో..

మౌలాలి: బీజేపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ వినాయక్‌నగర్ కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం నవభారత్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్ఎస్ నేతలు

మౌలాలి: మౌలాలి డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పూలపల్లి జగదీష్‌యాదవ్, ఒగ్గు మురళీకృష్ణ, యాదగిరిలు బుధవారం మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే బీజేపీ ధ్యేయమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. బీజేపీ గెలుపునకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్, నాయకులు భానుప్రకాష్, చంద్రశేఖర్‌యాదవ్, వెంకటేష్, సాయిబాబు, లింగారావు, మోహన్‌యాదవ్, శివగౌడ్, వెంకటేష్, భరత్‌భూషన్, రమణ, జాహంగీర్, మహేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఈటలకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న శ్రవణ్


వినాయక్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

సస్పెన్షన్‌లో ఉన్న విద్యుత్ ఏఈ నివాసంలో ఏసీబీ సోదాలు


బొల్లారంలో అనిల్‌కుమార్ ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

అల్వాల్: విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పని చేస్తూ సస్పెన్షన్‌లో ఉన్న అనిల్ కుమార్ నివాసంలో ఏసీబీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ నేతృత్వంలో బొల్లారంలోని అనిల్ కుమార్ నివాసంలో ఉదయం నుంచి సోదాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా రూ. 34 లక్షల నగదు, 20 తులాల బంగారం, ఆరు ప్లాట్లు, 4.5 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.1.76 కోట్లుగా నిర్ధారించారు. కీసరలో ఏఈగా పని చేస్తున్న అనిల్ కుమార్ 2023 ఫిబ్రవరిలో ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల విచారణలో అతడికి ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు వెలుగులోకి రావడంతో అనిల్ కుమార్‌తోపాటు అతని బంధువుల నివాసాల్లో సోదాలు నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు.

మహిళలతో అసభ్యకర ప్రవర్తన.. వ్యక్తికి జైలు


పరశురామ్

చిలకలగూడ: మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష పడింది. చిలకలగూడ సీఐ అనుదీప్, ఎస్ఐ జ్ఞానేశ్వర్ వివరాల ప్రకారం.. మెట్టుగూడకు చెందిన పరశురామ్ (34) మంగళవారం రాత్రి బస్తీలోని మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తుండగా స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు పరశురామ్‌ను అదుపులోకి తీసుకుని ఈ–పెట్టీ కేసు నమోదు చేశారు. బుధవారం సికింద్రాబాద్ 15వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా రెండ్రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి రవిశంకర్ తీర్పునిచ్చారు.

ప్రజల గళం వినిపించేందుకు కృషి చేస్తా..


వాకర్స్‌తో కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి

మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి

బోడుప్పల్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ నుంచి తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో ప్రజల తరుపున గళం వినిపించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లక్ష్మీనగర్ (హుడా) పార్కులో బుధవారం వాకర్స్‌తో కలిసి ఆమె మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసిందన్నారు. ప్రజా సమస్యలపై పార్లమెంట్‌లో బలంగా వినిపించాలంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఆమె కోరారు. వాకర్స్‌తో ముచ్చటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారు మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి కార్యకర్త గెలుపే లక్ష్యంగా పనిచేయాలంటూ.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్‌యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహ్మారెడ్డి, కార్పొరేటర్లు బొమ్మక్ కల్యాణ్‌కుమార్, సింగిరెడ్డి పద్మారెడ్డి, సుమన్‌నాయక్, బీ – బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నాయకులు రాపోలు రాములు, హరినాథ్‌రెడ్డి, పొన్నం రవిగౌడ్, నర్సింగ్‌రావు తదితరులున్నారు.

సిబ్బంది విధులెక్కడో.. ఓటు అక్కడే..

- లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనేవారు ఓటు వినియోగించుకునేలా ఏర్పాట్లు
- ఇతర నియోజకవర్గంలో విధులు నిర్వర్తిస్తే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగం
- మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో 313 సెక్టోరియల్ అధికారులు, 19,450 ఎన్నికల సిబ్బంది

సాక్షి, మేడ్చల్ జిల్లా: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బంది తప్పని సరిగా ఓటును వినియోగించుకునేలా ఎన్నికల సంఘం కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఓటు కలిగి ఉండి.. అదే నియోజకవర్గం పరిధిలో మరోచోట విధులు నిర్వర్తిస్తున్న వారికి ఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) ద్వారా అక్కడే ఓటు వినియోగించుకునే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది. ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్ అవసరం లేకుండా విధులు నిర్వర్తించే చోట ఓటువేయవచ్చు.

ఈడీసీతో వినియోగం

ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ) ద్వారా ఓటు వినియోగించుకునే వారందరూ ఫారం–12ఏ నింపి ఇవ్వాల్సి ఉంటుంది. పోలింగ్ తేదీకి ముందే ఈ దరఖాస్తును సహాయ రిటర్నింగ్ అధికారి(ఏఆర్వో)కి సమర్పించాల్సి ఉంటుంది. ముఖ్యంగా ఎన్నికల విధుల వివరాలు, ఓటు ఉన్న శాసనసభ నియోజకవర్గం, గ్రామం, పట్టణం ఓటరు జాబితాలో వరుస సంఖ్య వంటి విషయాలు స్పష్టం చేయాల్సి ఉంటుంది. పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఓటు వేసేందుకు అనుమతిస్తారు.

పరిధి మారితే పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు లేదా కింది స్థాయి సిబ్బంది ఎవరైనా వారు లోక్‌సభ నియోజకవర్గం పరిధి దాటి మరో నియోజకవర్గం పరిధిలో విధులు నిర్వర్తించాల్సి వస్తే తప్పని సరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాల్సి ఉంటోంది. సిబ్బంది ముందస్తుగా దరఖాస్తు చేసుకుంటేనే అవకాశం ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్‌ను కూడా ఈడీసీ పద్ధతి మాదిరిగా ముందస్తుగా దరఖాస్తు స్వీకరించి ఓటు హక్కు కల్పిస్తారు.

ఎన్నికల సిబ్బంది 19,450 మంది

మల్కాజిగిరి పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, ఎల్బీనగర్ ఉన్నాయి. ఈ లోక్‌సభ నియోజకవర్గంలో 313 మంది సెక్టోరల్ అధికారులు ఉండగా, 19,450 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

ఫౌండేషన్ డే పండుగ ప్రారంభం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం ఇంజినీరింగ్ కాలేజీ నుంచి సెంటినరీ పైలాన్ వరకు జరిగిన 2కె రన్‌ను వీసీ ప్రొ.రవీందర్ జెండా ఊపి ప్రారంభించారు. ఫౌండేషన్‌డే భాగంగా మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమామాలు ఉంటాయని నేడు, రేపు (25, 25) ఓపెన్ హౌస్, ఉస్మానియా కార్యక్రమాలలో భాగంగా ప్రసంగాలు, సదస్సులు, ఎగ్జిబిషన్స్, సాంస్కృతిక కార్యక్రమాలకు క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలలను విభాగాలను ముస్తాబు చేసినట్లు వివరించారు. రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

ఎన్ఎంఆర్ఈసీ గౌరవ అధ్యక్షుడు నల్లా మల్లారెడ్డి


ఎన్ఎంఆర్ఈసీ పారిశ్రామిక పరిశోధన సమావేశంలో ప్రతినిధులు

ఘట్‌కేసర్: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన అలవర్చుకుంటే ఉన్నత లక్ష్యాలకు చేరుకుంటారని నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఎంఆర్ఈసీ) గౌరవ అధ్యక్షుడు నల్లా మల్లారెడ్డి అన్నారు. కాచవానిసింగారం దివ్యానగర్ నల్లా మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 13వ పారిశ్రామిక సంస్థ పరిశోధన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగానికి అవసరమైన ఆవిష్కరణల కోసం ప్రధానంగా దృష్టి సారించాలని, అవి సామాన్యులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా కంపెనీ ప్రతినిధులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమేశ్, ఎంబీఏ హెచ్‌ఓడీ రాజశేఖర్, కాగ్నిజెంట్, అల్ట్రాటెక్ సిమెంట్, జెన్ టెక్నాలజీ, నిఖిత ఇండస్ట్రీస్, నవనామి గ్రూపు, ఓయూ బిజినెస్ ఇంక్యూబేటర్, ఏకేఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ తదితర కంపెనీ ప్రతినిధులు అధ్యాపకులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉరేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. లాలాగూడ రైలు పట్టాల పక్కనున్న ఓ చెట్టుకు ఉరేసుకున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతుడికి 45 ఏళ్లు ఉంటాయని చేతిపై హెచ్ అని టాటూ, ఒంటిపై గులాబీ రంగుపై నల్లని చుక్కల చొక్కా, నల్లని ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. వేరే ప్రాంతం నుంచి లాలాగూడకు వచ్చి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం ఆయన నివాసంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టనున్న బస్సు యాత్ర విజయవంతం కావాలని కోరుకుంటూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

పక్కదారి పడుతున్న ఉచిత నీటి ట్యాంకర్లు

సైదాబాద్: సింగరేణి కాలనీ గుడిసెవాసుల కోసం సరఫరా చేయాల్సిన ఉచిత నీటి ట్యాంకర్లు అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పక్కదారి పడుతున్నాయని సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ ఆరోపించారు. బుధవారం ఆయన సింగరేణి కాలనీలో మాట్లాడుతూ, సింగరేణి కాలనీలోని గుడిసెవాసులకు నల్లా కనెక్షన్లు లేకపోవడంతో నిత్యం జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లపైనే నీటి కోసం ఆధారపడుతున్నారని తెలిపారు. 13 ట్యాంకర్లతో రోజూ 100 నుంచి 120 ట్రిప్పులు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా, వేసవి కాలం నీటి ఎద్దడిని అనువుగా చేసుకున్న ట్యాంకర్ల యజమానులు ఉచిత ట్యాంకర్లను ఇతరులకు అమ్ముకుంటూ డబ్బు చేసుకుంటున్నారని అన్నారు. అందువల్ల సరిపోను ట్యాంకర్లు రాక గుడిసెవాసులు నీటి కోసం ఇబ్బందిపడుతున్నారన్నారు. వైశాలీనగర్ జలమండలి కార్యాలయం నుంచి సరఫరా అవుతున్న ట్యాంకర్ల విషయమై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని, లేకుంటే జలమండలి కార్యాలయాన్ని ముట్టడిస్తామని మోతీలాల్ నాయక్ హెచ్చరించారు. సమావేశంలో సంఘం నాయకులు సక్రిబాయ్, శాంతిబాయ్, దేవులా నాయక్, మోహన్ నాయక్ పాల్గొన్నారు.